ప్రతి కుటుంబానికీ డిజిటల్ కార్డు

- కుటుంబ యజమానిగా మహిళ
- 'తూర్పు'నకు 3500 ఇండ్లు
- మంత్రి కొండా సురేఖ
- పైలట్ ప్రాజెక్ట్‌గా సర్వే ప్రారంభం

కాశీబుగ్గ: జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ

కాశీబుగ్గ, అక్టోబర్ 3: ప్రతి కుటుంబానికీ డిజిటల్ కార్డు అందజేయనున్నట్లు రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ 12వ డివిజన్ దేశాయిపేటలో జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్ట్‌గా డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేను గురువారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడారు. ఫ్యామిలీ యూనిట్‌గా డిజిటల్ కార్డు అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే ప్రారంభించినట్లు చెప్పారు. వరంగల్‌లోని రెండు డివిజన్లను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. మరణించిన వారి పేర్లను తొలగించి, కుటుంబంలో కొత్తగా వివాహాలు జరిగిన వారికి కార్డులు అందజేస్తామన్నారు. ఈ కార్డులో మహిళ కుటుంబ యజమానిగా ఉంటుందన్నారు. కలెక్టర్ ఉద్యోగులు, సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి సర్వే చేయిస్తారన్నారు. లోపాలు ఉంటే పైలట్ ప్రాజెక్టులో గుర్తించి సరి చేస్తామన్నారు. ప్రజల వద్దకే వచ్చి డిజిటల్ కార్డులు అందజేస్తామని, దళారులను నమ్మొద్దన్నారు. తూర్పు నియోజకవర్గానికి 3500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు మరమ్మతులు చేసి అర్హులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్య శారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, గ్రేటర్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు కావటి కవితారాజుయాదవ్, బస్వరాజ్ కుమారస్వామి, సురేశ్‌జోషి, పుర్కాన్, టీపీఆర్వో కోలా రాజేశ్, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు సహకరించాలి

కాశీబుగ్గలో దసరా ఉత్సవాలకు సహకరించాలని మంత్రి కొండా సురేఖను కమిటీ సభ్యులు కోరారు. కాశీబుగ్గ పద్మనగర్ ప్రాంతంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు పూర్తి సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దూపం సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, కన్వీనర్ బయ్యా స్వామి, మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, నాయకులు శ్రీనివాస్, రాజ్‌కుమార్, సిద్దోజు శ్రీనివాస్, దాసరి రాజేశ్, ఓంప్రకాశ్ కోలారియా, సిలువేరు థామస్, కూచన రవీందర్, వేముల నాగరాజు, రామ యాదగిరి, సిందం చంద్రశేఖర్, క్యాతం రంజిత్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభం

చౌటపెల్లిలో పీఏసీఎస్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ కావ్య

పర్వతగిరి, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం వరంగల్ ఎంపీ కడియం కావ్యతో మండలంలోని చౌటపెల్లిలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం పీఏసీఎస్ నూతన భవనాన్ని ప్రారంభించి 500 మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కొంకపాక నుంచి షాపూర్ వరకు రూ. 2 కోట్లతో రోడ్డు, జమాల్‌పురం నుంచి వడ్లకొండ చెరువు వరకు రూ. 2.57 కోట్లతో రోడ్డు, జమాల్‌పురం నుంచి జమాల్‌పురం వరకు రూ. 2.40 కోట్లతో రోడ్డు, పీఆర్ రోడ్డు నుంచి తండా వరకు రూ. 2 కోట్లతో రోడ్డు, అనంతారం నుంచి నల్లబెల్లి గ్రామం వరకు రూ. 70 లక్షలతో రోడ్డు, అనంతారం గ్రామం నుంచి లోహిత వరకు రూ. కోటి 80 లక్షలతో రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ త్వరలో పేదలకు భూమి పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లను కట్టించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అతి త్వరలో నాణ్యమైన చీరలను మహిళలకు అందించేందుకు సీఎం ఆలోచన చేస్తున్నారన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టాస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, చౌటపెల్లి, పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్లు గొర్రె దేవేందర్, మనోజ్‌కుమార్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మధుసూదన్‌రావు, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఇన్‌చార్జి డీపీవో రాంరెడ్డి, డీసీవో నీరజ, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఉర్సు చెరువులో చేపలను వదులుతున్న మంత్రి సురేఖ, కలెక్టర్

చేపల సీడ్స్ పంపిణీ

కరీమాబాద్, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం, మత్స్యశాఖ ఆధ్వర్యంలో అందించిన చేపపిల్లలను గురువారం ఉర్సు చెరువులో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ సత్య శారద చేపలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం ఉచితంగా చేపలు పంపిణీ చేస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని మత్స్యకారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్ల రవి, మాజీ కార్పొరేటర్లు కేడల పద్మ, కత్తెరశాల వేణుగోపాల్, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ కార్డును ఉపయోగించుకోవాలి

ఎమ్మెల్యే దొంతిమాధవరెడ్డి

డిజిటల్ స్మార్ట్ కార్డు ప్రొసిడింగ్స్‌ను కుటుంబానికి అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట/నెక్కొండ/దుగ్గొండి/నర్సంపేటరూరల్, అక్టోబర్ 3: ప్రజలు డిజిటల్ కార్డును వినియోగించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ కలిపి డిజిటల్ కార్డుగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ జోన్న, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ బత్తిని రాజేందర్, మున్సిపాలిటీ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, కౌన్సిలర్లు ఎలకంటి విజయకుమార్, చిలువేరు రజినీభారతి, ఓర్సు తిరుపతి పాల్గొన్నారు. అలాగే, నెక్కొండ మండలంలోని వెంకటాపురం–తోపనపల్లి గ్రామాల మధ్య లోలెవల్ కాజ్‌వే కల్వర్టు మరమ్మతులను దొంతి పరిశీలించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే దుగ్గొండి మండలంలోని మదిర మందపల్లిలో డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు సర్వేను ప్రారంభించారు. ఆర్డీవో కృష్ణవేణి, తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు. తర్వాత నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం గ్రామ శ్రీరామ ధాన్య రైతు విత్తన ఉత్పత్తిదారుల పరస్పర సహకార పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో ఏవీఆర్ 15వ వర్ధంతి, శశి రాజగోపాలన్ 13వ వర్ధంతిలో దొంతి పాల్గొన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే అర్శనపెల్లి వెంకటేశ్వరరావు (ఏవీఆర్) న్యాయవాధిగా, రైతు బిడ్డగా, సహకార ఉద్యమకారుడిగా, లైబ్రరీ నిర్మాతగా, సహకార, గ్రామీణ పరపతి పొదుపు సంఘం వ్యవస్థాపకుడిగా మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. నాయకులు గోపు జయపాల్‌రెడ్డి, అప్పారావు, ప్రభాకర్ రావు, పాలాయి శ్రీనివాస్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బత్తిని రాజేందర్, ఓర్సు తిరుపతి, సాంబయ్య, లక్ష్మణ్, నూనె కుమారస్వామి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

రుణమాఫీ చెక్కుల పంపిణీ

పర్వతగిరి, అక్టోబర్ 3: చౌటపల్లిలో ఇటీవల రుణమాఫీ అయి పీఏసీఎస్ ద్వారా నూతన రుణాలు పొందిన రైతులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గురువారం చెక్కులు అందించారు. అనంతరం గ్రామంలోని సీతారామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, నాయకులు పిన్నింటి అనిల్‌రావు పాల్గొన్నారు. తర్వాత కల్లెడలో దుర్గాదేవికి పూజలందించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. అదేవిధంగా గోరుగుట్టతండాలో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.

దేవీ శరన్నవరాత్రోత్సవాలు షురూ..

గ్రామాల్లో కొలువుదీరిన దుర్గామాత
ఆదిలక్ష్మి అవతారంలో దర్శనం

కాశీబుగ్గ, కొత్తవాడలో దుర్గామాత భారీ విగ్రహం

రాయపర్తి/నర్సంపేట/ఖానాపురం/వర్ధన్నపేట/నల్లబెల్లి/చెన్నారావుపేట/నర్సంపేట రూరల్/గీసుగొండ/కాశీబుగ్గ/నెక్కొండ, అక్టోబర్ 3: జిల్లావ్యాప్తంగా గురువారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామాలు, పట్టణాల్లో దుర్గామాత అమ్మవారు కొలువుదీరారు. మొదటి రోజు ఆదిలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాయపర్తి మండలకేంద్రంతోపాటు మైలారం, తిర్మలాయపల్లి, కొండూరు, కాట్రపల్లి, సన్నూరు, పెర్కవేడు, కొండాపురం, కొత్తూరులో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి విగ్రహాలను మండపాలకు చేర్చి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠించారు. నర్సంపేటలోని వల్లభ్ నగర్‌లో, వాసవీమాత ఆలయంలో ఉత్సవాలను ప్రారంభించారు. ఖానాపురంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, బుధరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు అశోక్ నగర్‌లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. వర్ధన్నపేటతోపాటు ఇల్లందలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నల్లబెల్లిలోని వాగ్దేవి యువజన కళా సంస్థ ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. చెన్నారావుపేట మండలవ్యాప్తంగా అమ్మవారు కొలువుదీరారు. నర్సంపేట మండలంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు షురూ అయ్యాయి. గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి, మచ్చాపురం, కొమ్మాలతోపాటు వరంగల్ 15, 16వ డివిజన్ల పరిధిలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలందిస్తున్నారు. వరంగల్ 19వ డివిజన్ నర్సంపేటరోడ్డులోని శ్రీకనకదుర్గామాత ఆలయంలో ఉత్సవాలను సురేఖ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మంత్రితోపాటు మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారదను సత్కరించారు. ములుగురోడ్డులోని శ్రీగణపతి సచ్చిదానంద వరదా దత్తక్షేత్రంలో చండీహోమం నిర్వహించారు. నెక్కొండ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. వరంగల్ కొత్తవాడలో భారీ దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలందిస్తున్నారు. విగ్రహానికి 50 తలలు, 75 చేతులు ఏర్పాటు చేశారు. 16 అడుగుల ఎత్తుతో వరంగల్‌లోని రాజరాజేశ్వరి ఆలయం పక్కన తయారు చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఊరూరా గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి : రేవూరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

సంగెం, అక్టోబర్ 3: ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సంగెం మండలంలోని తీగరాజుపల్లిలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గురువారం ఆయన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో ఐదు గురు ఎస్టీలకు ఎస్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఆశాలపల్లిలో వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను ఆయన కలిసి పరామర్శించారు. ఆశాలపల్లి నుంచి రాంచంద్రాపురం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. తీగరాజుపల్లి జీపీ సిబ్బందిని సత్కరించారు. ఉజ్వల మారి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సోమిడి అంజన్‌రావు, మాజీ జడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ, మాజీ సర్పంచ్‌లు మంగ్యానాయక్, కిశోర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చల్లా ధర్మారెడ్డి

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం, అక్టోబర్ 3: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోడూరి సదయ్య తండ్రి వీరమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి కుమారులు సదయ్య, వెంకటేశ్వర్లు, సంపత్‌తోపాటు వారి కుటుంబ సభ్యులను ధర్మారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి, మాజీ ఎంపీపీ సదానందం, మాజీ సర్పంచ్ బాబు, మన్సూర్ అలీ, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు యార బాలకృష్ణ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

శివాని మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి

రాయపర్తి, అక్టోబర్ 3: బంధన్‌పల్లి మాజీ సర్పంచ్ భూక్యా దీప్లానాయక్ వరంగల్‌లోని గార్డియన్ దవాఖానలో, ఇదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ కార్యదర్శి డెక్క అశోక్ ఆరెపల్లిలోని ఎన్ఎస్ఆర్ దవాఖానలో ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం దవాఖానలకు వెళ్లి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అదేవిధంగా కొండూరు మాజీ సర్పంచ్ గుగులోత్ మంగ్తాలీ మనుమరాలు అశ్విని మృతి చెందగా, గ్రామానికి చేరుకున్న ఎర్రబెల్లి అశ్విని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల నాయకులు అనిమిరెడ్డి, కుమార్, కర్ర రవీందర్‌రెడ్డి, పూస మధు, సత్యనారాయణరావు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, చిన్నాల రాజబాబు, బాషబోయిన సుధాకర్, చిట్యాల వెంకటేశ్వర్లు, ఆవుల కేశవరెడ్డి, కుల్లా ఎల్లాగౌడ్ ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియ చేయునది ఏమనగా నా క్లయింట్ అగు బి. రాజేశ్వర్ రావు, తండ్రి: వెంకట్రావు, వయస్సు: 53 సం॥రాలు, వృత్తి : వ్యాపారం, నివాసం: ఇ. నెం. 2-7-123, భవాణి నగర్, హనుమకొండ జిల్లా గారు తేది. 24-09-2024 రోజున ములుగు రోడ్డు నుండి భవాణి నగర్‌కు బైక్ పై వస్తుండగా ఒరిజినల్ రిజిస్టర్ డాక్యుమెంట్ నెం. 15829 / 1989 మరియు 15830 / 1989, ప్లాటు నెం. 54 మరియు 55, సర్వే నెం. 51 లో విస్తీర్ణం 534 చ॥గ॥ల స్థలము సహేబ్‌నగర్, కుర్దు గ్రామము, హైయత్‌నగర్ రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రంకు చెందిన పై ఒరిజినల్ దస్తావేజు మార్గ మధ్యలో పోయినవి. ఈ డాక్యుమెంట్ మార్గ మధ్యలో పోయినందున ఇట్టి డాక్యుమెంట్ వెతికిన దొరకనందున, ఒక వేళ ఎవ్వరికైన దొరికినచో నా క్లయింటుకు అందజేయగలరు. లేదా ఈ క్రింది తెలిపిన నా చిరునామకు అందజేయగలరు. కావున తగిన పారితోషికము ఇవ్వబడును.

(నా క్లయింట్ ఆదేశానుసారము ఈ బహిరంగ ప్రకటన ఇవ్వడమైనది).

ఇట్లు **పి. శివకుమార్,** న్యాయవాది
ఇ.నెం. 1-7-276/1, రోడ్డు నెం.9 అడ్వకేట్స్ కాలనీ, హనుమకొండ జిల్లా. సెల్: 9000901998.

ఐకేపీలో అక్రమాలపై విచారణ

అద్దె యంత్రాలు అమ్ముకున్నట్లు అధికారుల నిర్ధారణ?

విచారణ జరుపుతున్న అధికారులు

రాయపర్తి, అక్టోబర్ 3: మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో కొంతకాలంగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని మండల ప్రజలు సెర్ప్ జిల్లా అధికారులు, డీఆర్డీవోకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం ఏపీడీ రేణుకాదేవి, డీపీఎంలు సరిత, దయాకర్, హెచ్ఆర్ ఏపీఎం ధర్మేందర్‌తో కూడిన ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. రెండేళ్ల క్రితం స్వర్ణభారతి మండల సమాఖ్య రూ. 19 లక్షలతో వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రం (సీహెచ్‌సీ–కస్టమర్ హైరింగ్ సెంటర్) ఏర్పాటు చేసింది. నిర్వహణను ఐకేపీ ఉద్యోగులు, సిబ్బందికి అప్పగించారు. జాన్‌డీయర్ ట్రాక్టర్, రోటోవేటర్, గడ్డి కట్టే యంత్రం, మక్కజొన్న పట్టే యంత్రం, కేజీవీల్స్, ఆఫ్ వీల్స్‌తో కూడిన 8 రకాల యంత్ర పరికరాలు, పనిముట్లను సమకూర్చారు. నిర్వాహణను గాలికొదిలేసి యంత్రాలను గత ఫిబ్రవరిలో జయరాంతండాకు చెందిన ఓ రైతుకు రూ. 13.50 లక్షలకు విక్రయించుకున్నట్లు తెలిసింది. దీంతో విచారణ చేపట్టిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఐకేపీ ఏపీఎం రాపాక కిరణ్‌కుమార్, ఆడిటర్ గుండె సంపత్‌కుమార్, సీసీలు, స్వర్ణభారతి మండల సమాఖ్య పాలక మండలి ప్రతినిధులు విచారణలో పాల్గొన్నారు.

వీసీల నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి: పెద్ది

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట, అక్టోబర్ 3: వీసీల నియామకాల్లో కాకతీయ యూనివర్సిటీకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పని చేసిన చాలా మంది కేయూలో ఉన్నారని, వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కేయూ వీసీ నియామకం కోసం సెర్చ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కమిటీలోని ముగ్గురు సభ్యుల్లో కేయూ నామినీగా జేఎన్టీయూ రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ ఆవుల దామోదర్, విద్యాశాఖ నుంచి జమ్మూ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సంజీవ్ జైన్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీఎస్ శాంతకుమారి నియామకం అయ్యారని వివరించారు. కేయూ వీసీ కోసం 158 మంది దరఖాస్తులు చేశారని, ఇందులో కేయూ నుంచి నలుగురు ప్రొఫెసర్లు ఉన్నట్లు చెప్పారు. అలాగే, 8 మంది రిటైర్డ్ ప్రొఫెసర్లు దరఖాస్తు చేశారని తెలిపారు. ఏ ప్రతిపాదికన నియామకం చేస్తున్నారో చెప్పాలని కోరారు.

గిరిజన క్రీడాకారిణి కావేరికి స్వాగతం

కావేరికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రాయపర్తి, అక్టోబర్ 3: పన్యానాయక్‌తండాకు చెందిన క్రీడాకారిణి ఆంగోత్ కావేరికి గురువారం తండావాసులు కిష్టాపురం క్రాస్ రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భూక్యా వెంకట్రాంనాయక్, తండావాసి డాక్టర్ భూక్యా రాజారాంనాయక్ మాట్లాడుతూ ఆంగోత్ మౌనిక–యాకూనాయక్ కుమార్తె కావేరి కొంతకాలంగా మెదక్ జిల్లాకేంద్రంలోని స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. రాడికల్ మైండ్స్ సంస్థ సహకారంతో కావేరి గత నెల 21 నుంచి 28వ తేదీ వరకు సౌత్ కొరియా రాజధాని సియోల్‌లో జరిగిన హోల్ లెస్ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. ప్రతిభ కనబర్చిన కావేరి దేశాన్ని ఐదో స్థానం లో నిలిపినట్లు వివరించారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యదర్శి శాంతిరాజు, వీరూనాయక్, బాలాజీనాయక్, బుచ్చ న్న, రవి, శ్రీను, అనిల్, లక్పతి, వెంకన్న పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం

సంగెం, అక్టోబర్ 3: ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బిట్ల రాజేశ్వర్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నుంచి రూ. 60 వేల చెక్కును సంఘం నాయకులు అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి, దయాకర్, అను సత్యం, ఫొటోగ్రాఫర్లు ఎ.రాజు, ఎండీ ఫక్రుద్దీన్, కంచం మహేందర్, దేవులపెల్లి రాజు, కుందారం సతీశ్, రావుల రమేశ్ పాల్గొన్నారు.

'పనుల్లో నాణ్యత ఉంటేనే బిల్లుల చెల్లింపు'

కాశీబుగ్గ, అక్టోబర్ 3: అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండేటే బిల్లులు చెల్లిస్తామని గ్రేటర్ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే స్పష్టం చేశారు. బల్దియా సిబ్బంది ఆధ్వర్యంలో 13వ డివిజన్‌లో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఎంహెచ్‌ఎన్ గర్, చైతన్యకాలనీ, గణేశ్‌నగర్‌లో నిర్మించిన అంతర్గత సీసీరోడ్లు, డ్రైనేజీల నాణ్యత, రోడ్డు విస్తరణను పరిశీలించారు. ఎంబీ రికార్డు ప్రకారమే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. ఆమె వెంట ఈఈ శ్రీనివాసరావు, డీఈ రంగారావు, ఏఈ కృష్ణమూర్తి, ముజమ్మిల్ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చెన్నారావుపేట, అక్టోబర్ 3: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన చింతకాయల చంద్రమౌళి(55) తన వ్యవసాయ పొలం వద్ద గత నెల 29న పురుగుల మందు తాగాడు. గమనించిన రైతులు వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య వినోద, కుమారుడు దిలీప్, కూతురు శిరీష ఉన్నారు. చంద్రమౌళి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కృష్ణానగర్‌లో డిజిటల్ కార్డు సర్వే

సంగెం, అక్టోబర్ 3: మండలంలోని కృష్ణానగర్‌లో గురువారం ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను అధికారులు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య, గ్రామ ప్రత్యేకాధికారి సాయి, కార్యదర్శి ఖలీల్ పాల్గొన్నారు.

గోదాంలోనే మామిడి మార్కెట్

కాశీబుగ్గ, అక్టోబర్ 3: పండ్ల మార్కెట్ మామిడికాయ నిర్వహణ ముసలమ్మకుంటలో నిర్వహించనున్నట్లు ఎనుమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల తెలిపారు. చాంబర్ ప్రతినిధులతోపాటు పండ్ల వ్యాపారులతో కలిసి గురువారం మార్కెట్ కమిటీ స్థలాలను పరిశీలించారు. ఎనుమాముల ప్రధాన రోడ్డులోని స్థలంతోపాటు ముసలమ్మకుంట గోదాం ఖాళీ స్థలాలను పరిశీలించారు. పండ్ల వ్యాపారులు వినతిపత్రం ఇస్తే జేడీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి స్థలం కేటాయిస్తామని నిర్మల తెలిపారు.

కార్పొరేటర్